క్లుప్తంగా

ప్రేమ్‌చంద్ జయంతి



జడ్చర్ల టౌన్: నవలా చక్రవర్తి ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. విభాగం అధ్యక్షుడు డా.నరసింహారావు, వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తెలుగు విభాగం అధ్యక్షురాలు సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా జయరాం నాయక్



నవాబుపేట: ఎట్టకేలకు నవాబుపేటకు ఎంపీడీఓ వచ్చారు. దాదాపు ఆరునెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండగా.. సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఇంచార్జీగా కొనసాగుతూ వచ్చారు. ఈ క్రమంలో తాజాగా మద్దూర్ మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన జయరాం నాయక్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బుధవారం నవాబుపేటలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

దాతలు ముందుకు రావాలి

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దాతల సహకారం అవసరమని.. తాము స్వచ్ఛంద సంస్థ ద్వారా ముందుకు వచ్చినట్లు నిర్వాహకులు గోపీనాథ్, రాజవర్ధన్ తెలిపారు. బుధవారం యన్మన్‌గండ్ల పాఠశాలలో ఆశ్రయ ఫౌండేషన్ ద్వారా 171 విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, షూస్‌లు అందించారు. 171 మందికి విద్యార్థులకు నోట్ బుక్స్, బాగ్యగులు, షూస్ అందించారు. ప్రముఖులు లక్ష్మయ్య, రఘువీర్, వెంకటయ్య, సీఆర్‌పీ జనార్దన్, హెచ్‌ఎం శ్రీనివాస్, రాములు, మంజుల ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

దేవరకద్ర: కౌకుంట్ల మండలం పేరూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం నోట్ బుక్స్, ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన డి. సత్యన్న జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీకాంత్, చంద్రకాంత్, గోపికాంత్‌లు ఆర్థికసాయంతో కార్యక్రమం చేపట్టారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం దారుల ధర్నా



దేవరకద్ర: మండల కేంద్రంలోని పశువైద్యశాల ముందు బుధవారం గొర్రెల పెంపకం సహకార సంఘాల ప్రతినిధులు ధర్నా చేశారు. గొర్రెలకు వచ్చే రోగాలకు సంబంధించి పశువైద్యశాలలో సరి అయిన మందులు లేవన్నారు. దీంతో స్వంతంగా డబ్బులు ఖర్చు చేసి మందులు తెచ్చుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. దేవరకద్ర పశువైద్యశాలలో గొర్రెలు, మేకలకు సంబంధించి అన్ని వ్యాధులకు కావలసిన మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పశువైద్యాధికారి జీషన్‌అలీకి వినతిపత్రం అందజేశారు. కుర్వ సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన త్వరగా చేపట్టాలి



మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణన త్వరగా చేపట్టాలని.. బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన వల్ల బీసీల వాటా తేలిస్తే త్వరలో జరగబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల లెక్క బయట పడుతుందని అన్నారు. 60 శాతం ఉన్న బీసీలను ఓటింగ్ యంత్రాలుగా ఉపయోగించుకుంటున్నారని అన్నారు. కులగణన చేపడితే బీసీలకు 45 శాతంపైగా సీట్లు వస్తాయని అన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో 45 శాతం సీట్లు బీసీలకు కేటాయించేలా ఆమోద ముద్ర వేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, బీసీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మల్లికార్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన దాసర్‌పల్లి పాఠశాల



తరగతి గది వెనుక కిటికీ వద్ద ఊడిన ఇటుకలు

శిథిలావస్థలో దాసర్‌పల్లి పాఠశాల

- ఓ గదిలో పైకప్పు నుంచి కారుతున్న వర్షం నీరు
- కిటికీ వద్ద ఊడిపడుతున్న ఇటుకలు
- ఒక్క గదిలోనే అన్ని తరగతులు

అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో 5 తరగతులకు గాను సుమారు 35 మంది విద్యార్థులుండగా కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒకటి పూర్తి శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో భవనం పైకప్పు నుంచి ఆ గదిలో వర్షం నీళ్లు కిందికి కారుతున్నాయి. దీని వల్ల తరగతి గదిలో విద్యార్థులను కూర్చోపెట్టే పరిస్థితి లేదు. దీంతో దాని పక్కనే ఉన్న మరో గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు వర్షం కురిస్తే ఒక్క తరగతి గదిలోనే విద్యార్థులందరినీ కూర్చోపెట్టి చదువులు చెబుతున్నారు. వర్షం రాని సమయంలో కొందరు విద్యార్థులను పాఠశాల వరండాలో ఉంచి పాఠాలు బోధిస్తున్నారు. దీనివల్ల ఏ తరగతి విద్యార్థులకు ఏం బోధిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఇటుకలు ఊడిపోతున్నాయి..

శిథిలావస్థకు చేరిన గది వెనుక కిటికీ వద్ద ఇటుకలు ఊడి కింద పడుతున్నాయి. పైకప్పులో వర్షం నీళ్లు ఎక్కువ రోజులు నిలవడం వల్లే స్లాబులోంచి నీళ్లు కిందకు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. దీంతో పాటు నిర్వాహణ లేక కిటికీ వద్ద గోడ పూర్తిగా శిథిలమవుతోంది. కొన్ని ఇటుకలు గోడలోంచి కిందపడిపోయాయి. గోడకు ఏదైనా బలంగా తగిలితే కూలిపోయే విధంగా మారింది. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాలలో కొన్ని మరమ్మతు పనులు చేయించారు. అయితే శిథిలమైన గదిని బాగు చేయించడానికి తగినన్ని నిధులు లేకపోవడంతో దాన్ని బాగు చేయించలేదు. ముసురు వర్షాలు కురిస్తే ఈ గదితో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించక ముందే జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

దాసర్‌పల్లి పాఠశాలలో రెండు తరగతి గదుల్లో ఒక గది శిథిలావస్థకు చేరింది. వర్షం కురిస్తే పైకప్పు నుంచి నీళ్లు కిందికి కారుతున్నాయి. దాని పక్కనే ఉన్న మరో గదిలో తరగతులను కొనసాగిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద తగినన్ని నిధులు లేకపోవడంతో గదిని బాగు చేయించలేకపోయాం. నిధుల కోసం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

–రాజేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ, మూసాపేట

వైభవంగా బోనాల పండుగ



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హన్వాడ: టంకరలో బుధవారం బోనాల పండుగా వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వేడుకల్లో పాల్గొన్నారు. పోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు చేశారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, నాయకులు కృష్ణయ్యగౌడ్, శ్రీనివాసులు, లక్ష్మయ్య, బసిరెడ్డి, జంబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు



మాట్లాడుతున్న జడ్చర్ల అడిషనల్ కోర్టు జడ్జి మహమ్మద్ ముద్దసీర్

జడ్చర్ల టౌన్: విద్యార్థులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జడ్చర్ల అడిషనల్ కోర్టు జడ్జి మహమ్మద్ ముద్దసీర్ సూచించారు. మాచారం వద్ద ఉన్న నాగర్‌కర్నూలు ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కళాశాలకు పంపిస్తారని, వాళ్ల కలలను సాకారం చేసే దిశంగా ప్రతి విద్యార్థి కృషిచేయాలన్నారు. పట్టుదలతో చదవాలన్నారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక చట్టం ఎంతో కఠినంగా ఉందని.. అలాంటి చర్యలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే ప్రిన్సిపాల్‌కు, లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, టౌన్ ఎస్‌ఐ శివానందం, న్యాయవాది రాములు, కోర్టు సిబ్బంది దేవ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళలను అందరూ గౌరవించాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక మెప్మా భవనంలో మహిళా సంఘాల సభ్యుల కోసం తన సొంత ఖర్చులతో సుమారు వంద కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాలు జరిగినప్పుడు వారు నేల మీద కూర్చోవడం బాగుండదన్నారు. అందుకే తన వంతు సాయం చేస్తున్నానన్నారు. మహిళా గ్రూపులకు ఎలాంటి సమస్యలున్నా ముందుండి పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా ఆర్‌పీలు తమకు అప్పగించిన బాధ్యతలను బాగా నిర్వర్తించాలన్నారు. కాగా, మెప్మా భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయని, అపరిశుభ్రంగా ఉందన్నారు. బయటి వ్యక్తులు వచ్చి మూత్రవిసర్జన చేస్తున్నారని, మొత్తం దుర్గంధభరితంగా మారిందని మహిళలు వాపోయారు. వెంటనే పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి, బయటి వ్యక్తులు ఇటువైపు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో ఏఎంసీ జె.పవన్‌కుమార్, మెప్మా సీఓలు యాదయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో డీఈఈ ఐ.బి.బెంజిమన్ పదవీ విరమణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ పాల్గొన్నారు. అలాగే పిల్లలమర్రి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.

అటెన్షన్ ప్లీజ్



జానంపల్లి సర్వీసు రోడ్డు

ప్రమాదకర 'సర్వీస్' రోడ్డు

గండీడ్: జానంపల్లి వద్ద సర్వీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. మహబూబ్‌నగర్–చించోళి జాతీయ రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్న క్రమంలో గ్రామాల వద్ద మధ్యలో పదిమీటర్ల వెడల్పు ఉంచి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటి పక్కన ఫుట్‌పాత్ నిర్మించి దానిపక్కన 5.5 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా సర్వీసు రోడ్డును నిర్మిస్తున్నారు. అయితే కొన్నిచోట్ల ఇవి ప్రమాదకరంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. జానంపల్లి వద్ద ఉన్న సర్వీస్‌రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా కనిపిస్తోంది.

సంప్రదించవలసిన అధికారి:	రమేష్, డీఈఈ, నేషనల్ హైవే, మహబూబ్‌నగర్, సెల్: 95050 88195

హజిలాపూర్‌లో మెడికల్ క్యాంపు



దేవరకద్ర: హజిలాపూర్‌లో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ ఎమ్‌డి. రఫీక్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి అనుమానితులకు వైద్య పరీక్షలు చేయించారు. 83కి పరీక్షలు చేయగా అందులో 23 మందిని అనుమానితులుగా గుర్తించారు. వారికి చికిత్సలు అందించి మందులను అందజేశారు. క్యాంపులో పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్, సిబ్బంది బాలరాజ్, సత్యనారాయణగౌడ్, మల్లేశ్, గిరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వచ్చేనెల 11న.. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 3వ నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ ట్రోఫీని బుధవారం రాష్ట్ర పుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్‌పీ. వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నీని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అసోసియేషన్ ఫౌండర్ కోటకదిర వెంకటేశ్ మాట్లాడారు. పలు జిల్లాల నుంచి కరాటే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చిన్నచింతకుంట: ఉంద్యాలలో బుధవారం ఎస్‌ఐ శేఖర్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. మానవ హక్కులపై, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నచింతకుంట నూతన జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి అదుపు తప్పిన వాహనం



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై తుఫాన్ వాహనానికి కుక్క అడ్డువచ్చింది. దీంతో దాన్ని తప్పించబోయిన క్రమంలో వాహనం అదుపు తప్పిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి 15 మందితో కర్నూల్ వైపు వాహనం వెళ్తుండగా.. జానంపేట శివారులో ఘటన జరిగింది. వాహనం డివైడర్ పైకి దూసుకెళ్లి పక్క రోడ్డుపై నిలిచిపోయింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనం రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. ఘటనలో వాహనంలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారికి సమీపంలోనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. ప్రమాదంలో వాహనం రెండు టైర్లు పగిలిపోయాయి. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేని పోలీసులు తెలిపారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై వారం రోజులుగా హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని మంగవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అధికారులు దీనిపై ఆరా తీశారు. దీంతో ఎంపీఓ అనురాధ, పంచాయతీ కార్యదర్శి మహేందర్ బుధవారం అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్దకు వెళ్లి రహదారి నిర్వాహకులను కలిశారు. చౌరస్తాలో లైట్లు వెలగకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నందున వాటిని బాగు చేయించాలని సూచించారు. దీంతో వారు సాయంత్రం మరమ్మతు చేయించి లైట్లను వెలిగించారు.



వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

వనమహోత్సవ లక్ష్యం త్వరగా చేరుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

జడ్చర్ల టౌన్: గ్రామాల్లో నిర్దేశించిన వనమహోత్సవం లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో నిర్వహించి సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా లక్ష్యాలు ఎంత ఉన్నది తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోటానికి ఆటంకాలు ఏవైనా ఉన్నాయా అంటూ విచారించారు. త్వరగా లక్ష్యం పూర్తిచేసి నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. అదేవిధంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం గురించి సమీక్ష జరిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ వెంకటప్రసాద్, ఎంపీఓ సరోజ, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ

భూత్పూర్: వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని తాటిపర్తిలో సబ్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్ వారీగా డెలివరీల వివరాలు, ఇమ్యూనైజేషన్, సీజనల్ వ్యాధుల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదితరాలపై మండల వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే, ఫ్రైడేపై ఆరా తీశారు. మురుగునీరు నిల్వకుండా చూసేలా పంచాయతీ సిబ్బందిని ఆదేశించాలన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సమస్యలపై దృష్టిసారించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీల సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వనమహోత్సవంలో భాగంగా ఇచ్చిన గడువులోగా మొక్కలు నాటేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని.. ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఎంపీఓ నజీర్‌హైమద్, ఏపీఓ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు నందకిశోర్, ప్రవీణ్, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో సమావేశానికి ఉపాధ్యాయుల జాబితా సిద్ధం



జాబితా పరిశీలిస్తున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో సమావేశం నిర్వహించనుండగా.. అందుకు సంబంధించి జడ్చర్ల, మిడ్జిల్ మండలాల నుంచి 49 మంది ఉపాధ్యాయుల జాబితా సిద్ధం చేశారు. ఈమేరకు ఎంఈఓ మంజులాదేవి వివరాలు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం జడ్చర్ల ఎమ్మార్సీలో అందుబాటులో ఉన్న సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఉపాధ్యాయుల జాబితాను పరిశీలించారు. బదిలీ, పదోన్నతులు పొందిన వారిలో జడ్చర్ల మండలంలో 29మంది, మిడ్జిల్ మండలంలో 19మంది ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు. వారందరికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చినట్లు వివరించారు. సమావేశానికి హాజరు కావాల్సిన ఉపాధ్యాయులు తమ గుర్తింపుకార్డు తీసుకుని శుక్రవారం ఉదయం జడ్చర్ల ఎమ్మార్సీకి చేరుకోవాలని సూచించారు. ఉదయం అల్పాహారం చేసి రావాలని, మధ్యాహ్నభోజనం, నీటి వసతి కల్పిస్తామని తెలిపారు. రెండు మండలాల్లోనూ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయుల జాబితా రావాల్సి ఉందని వారికి గురువారం సమాచారం ఇస్తామని తెలిపారు.

ముగిసిన బదిలీల ప్రక్రియ



ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ సరోజ

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. దాదాపు అన్ని శాఖల్లోనూ అధికారులు బదిలీ కావటంతోపాటు పదోన్నతులు పొందారు. గతనెలలో ఉపాధ్యాయుల బదిలీల పర్వం ముగియగా అన్ని శాఖల్లోనూ బుధవారం వరకు ప్రక్రియ కొనసాగింది. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డా. సోమశేఖర్ వనపర్తికి బదిలీ అయ్యారు. అయన స్థానంలో హైదరాబాద్ నుంచి వస్తున్న డా.చంద్రకళ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డా. అప్పియాచిన్నమ్మ హైదరాబాద్ హుసేనీ ఆలం మహిళా డిగ్రీ కళాశాలకు బదిలీ అయి బుధవారం రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో హైదరాబాద్ విద్యానగర్‌లోని శ్రీ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డా. సుకన్య ఇక్కడకు వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జడ్చర్ల ఎంపీడీఓగా ఎస్.విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఊర్కొండపేట నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఎంపీఓగా జగదీశ్ మిడ్జిల్‌కు బదిలీకాగా ఆయన స్థానంలో మూసాపేట నుంచి వచ్చిన సరోజ బాధ్యతలు స్వీకరించారు. వైద్య ఆరోగ్యశాఖలోనూ ఆరోగ్యకార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. గంగాపురం పీహెచ్‌సీ డా. సమత జిల్లా ఆస్పత్రికి బదిలీ కాగా ఆమె స్థానంలో డా.నరేష్ బాధ్యతలు స్వీకరించారు.

రుణమాఫీపై రైతుల హర్షం



వెన్నాచేడ్‌లో..



నంచర్లలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మహమ్మదాబాద్: హామీ మేరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. బుధవారం నంచర్ల ఎస్‌బీఐ బ్యాంకు వద్ద రైతులు హర్షం వ్యక్తం చేసిన సందర్భంగా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా మాజీ అధ్యక్షుడు కమతం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: రుణమాఫీతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం వెన్నాచేడ్ ఎస్‌బీఐ వద్ద సీఎం రేవంత్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బాలస్వామి, మాజీ చైర్మన్ చిన్నయ్య, మాజీ సర్పంచ్ గోపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, ఎస్టీ సెల్ అధ్యక్షుడు టీక్యా నాయక్ పాల్గొన్నారు.